# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సామాజిక పునర్నిర్మాణానికి విద్య అత్యంత ప్రభావవంతమైన సాధనమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ 21వ శతాబ్దంలో భారతదేశం వేగవంతమైన అభివృద్ధికి దేశ వ్యవసాయ రంగంలో సంస్కరణలు అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.
- ❖ భారతరత్న నానాజీ దేశ్‌ముఖ్, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ల జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ వారికి నివాళులర్పించారు.
- ❖ రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

==========================

సామాజిక పునర్నిర్మాణానికి విద్య అత్యంత ప్రభావవంతమైన సాధనమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన గుజరాత్ విద్యాపీఠ్ 71వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో మొత్తం 1,713 డిగ్రీలను విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ... భారతదేశ స్వావలంబన జాతీయ ప్రాధాన్యత అని, జాతీయ స్వదేశీ ప్రచారంలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. బాహ్య సవాళ్లతో నిరుత్సాహపడకుండా ధైర్యం, ఉన్నత ఆదర్శాలు ప్రపంచ దృక్పథంతో ముందుకు సాగాలని రాష్ట్రపతి విద్యార్థులకు సూచిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

==========================

21వ శతాబ్దంలో భారతదేశం వేగవంతమైన అభివృద్ధికి దేశ వ్యవసాయ రంగంలో సంస్కరణలు అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన 42 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన బహుళ ప్రాజెక్టులు, పథకాలను ఈరోజు ప్రారంభించారు. అందులో 'పిఎం ధన్ ధాన్య కృషి యోజన', 'పప్పు ధాన్యాల ఆత్మనిర్భరత మిషన్'లు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ… ఈ పథకాలు దేశంలోని లక్షలాది మంది రైతుల జీవితాలను మారుస్తాయని అన్నారు. గత 11 సంవత్సరాలలో భారతదేశ వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు అయ్యాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తి 90 మిలియన్ మెట్రిక్ టన్నులు పెరిగిందని తెలిపారు. పాల ఉత్పత్తిలో భారత్ నేడు ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని ప్రధానమంత్రి వివరిస్తూ…

(వాయిస్ 33 సెకన్లు)

==========================

భారతరత్న నానాజీ దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ఈ రోజు ఆయనకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. గ్రామీణాభివృద్ధి, జాతి నిర్మాణంలో నానాజీ దేశ్‌ముఖ్ చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గ్రామీణ సాధికారత కోసం జీవితాంతం పాటు పడ్డారని కొనియాడారు. నానాజీ దేశ్‌ముఖ్ తన జీవితాన్ని పేదల అభ్యున్నతికి అంకితం చేశారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్  అన్నారు. యువతను సంఘటితపరచి, దేశ నిర్మాణంలో పాల్గొనేలా వారిని ప్రేరేపించడంలో విశేషమైన పాత్ర పోషించారని హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

==========================

ప్రముఖ నాయకుడు లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు నివాళులర్పించారు. సాధారణ పౌరులకు సాధికారత కల్పించడంలో భారత రాజ్యాంగ సమగ్రతను కాపాడటంలో జయప్రకాష్ నారాయణ్ ప్రముఖ పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజల సాధికారతకు కట్టుబడి ఉన్న దార్శనిక నాయకుడిగా జయప్రకాష్ నారాయణను ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అభివర్ణించారు.

==========================

భారతదేశంలో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. భారతదేశం-అమెరికా సంబంధాలు గురించి ఇరువురు చర్చించారు. సెర్గియో గోర్, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీని కూడా కలిశారు. భారత్ - అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం, ఉమ్మడి ప్రాధాన్యతలపై ఫలవంతమైన చర్చ జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

విరామం

==========================

రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను సందర్శించి కొత్తగా నిర్మించిన యాత్రి సువిధ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ… ప్రయాణీకుల రాకపోకలను సులభతరం చేయడానికి యాత్రి సువిధ కేంద్రాన్ని నిర్మించామన్నారు. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు, 150కి పైగా టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలను ప్రయాణీకుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగల

సమయంలో ప్రయాణికుల రద్దీని తీర్చడానికి 76 ఇతర స్టేషన్లలో కూడా ఇటువంటి శాశ్వత కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని అశ్విని వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

==========================

అమెరికాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్స్ తయారీ సంస్థ క్వాల్కమ్ (Qualcomm) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్రిస్టియానో ఆర్ అమోన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలో ఈరోజు కలిశారు. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్స్ ఆవిష్కరణల పరంగా భారతదేశం సాధించిన పురోగతిని ఈ సందర్భంగా ఇరువురు చర్చించారు. భారతదేశపు సెమీకండక్టర్స్, AI మిషన్ల పట్ల క్వాల్కమ్ సంస్థ నిబద్ధతను ప్రధానమంత్రి ప్రశంసించారు. సమిష్టిగా భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్మించడంలో భారత్ అత్యుత్తమ ప్రతిభను అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

==========================

ప్రపంచం నేడు అనేక సవాళ్ళు ఎదుర్కొంటున్నప్పటికీ భారతదేశం పటిష్టమైన వ్యవస్థా చైతన్యంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి శక్తి కాంత దాస్ అన్నారు. మెరుగైన స్వదేశీ ఉత్పత్తులు, స్థూల ఆర్థిక విధానాల ద్వారా భారత్ ప్రపంచ జీడీపీ వృద్ధిలో ఐదవ వంతు దోహదపడుతుందన్నారు. పూణేలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆయన ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ ప్రజలకు పారదర్శకంగా ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో అమెరికా ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

==========================

కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ రేపటి నుండి భారత్ లో పర్యటిస్తారు. ఆమె ముందుగా భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తో సమావేశమయ్యారు. ఆ తరువాత కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్‌లను కలిసి వాణిజ్యం, ఇంధనం భద్రతలో సహకారం గురించి చర్చిస్తారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడానికి అనితా ఆనంద్ ముంబైలోని వ్యాపార రంగ ప్రముఖులను కూడా కలవనున్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్, కేరళ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలోని కొన్ని ప్రాంతాలలో రేపు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఒడిశాలో కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రంలో వేటకు వెళ్ళే మత్స్యకారులకు IMD హెచ్చరికలు జారీ చేసింది.

==========================

భారత్ వెస్టిండీస్ పురుష జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 518 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. కెప్టెన్ శుభ్ మన్ గిల్ 129 పరుగుల అజేయ శతకంతో రాణించాడు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది.

==========================

==========================